సంపుటి :02 సంచిక :109 పేజీలు :05

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

ఉష్ణోగ్రతలు

కనిష్టం : 27

గరిష్టం : 34

# కాళేశ్వరం పేరిట గత ప్రభుత్వం దోపిడి

- కాంగ్రెస్ ప్రభుత్వాలు కట్టిన ప్రాజెక్టులకు చిన్న పగులు కూడా రాలేదు
- సంక్షేమాన్ని వెనకబడనివ్వం, అభివృద్ధిని ఆగనివ్వం
- ఉచిత విద్యుత్ పథకాలకు ఏటా రూ.13,992 కోట్ల ఖర్చు
- రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క
- భూపాలపల్లిలో భారీ ర్యాలీ, బహిరంగ సభ

05



మంగళవారం 17 , జూన్ 2025



# నెక్ట్స్ ఎవరు?

- ఇంజినీర్ల గుండెల్లో రైళ్లు.. ఒకటే దడ
- తేనెతుట్టెలా కాళేశ్వరం ప్రాజెక్ట్ అక్రమార్కులు
- ఇరిగేషన్ అధికారులు, ఇంజినీర్లపై అవినీతి మరకలు
- మాజీ ఈఎన్సీ హరిరాం, ఈఈ శ్రీధర్ నివాసాల్లో ఏసీబీ దాడులు
- వందలాది కోట్ల స్థిరాస్తుల గుర్తింపు.. వాటిలో కొన్ని జప్తు
- పలువురు ఇంజినీర్లు, ఇరిగేషన్ అధికారులపై ఘోష్ కమీషన్ సిఫార్సు

02

కాళేశ్వరం ప్రాజెక్ట్ కుంగుబాటులో పీసీ ఘోష్ కమిషన్ విచారణ, అదాయానికి మించి అక్రమాస్తుల అంశంలో అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) విచారణ.. ఇంజనీర్లలో దడ పుట్టిస్తున్నది. ఇప్పటికీ కాళేశ్వరం పరిధిలోని పనిచేసిన ఇరిగేషన్ ఈఎన్సీ హరిరామ్‌కు చెందిన నివాసాలు, బంధువుల ఇళ్లలో ఏసీబీ దాడులు చేసింది. అక్రమాస్తులు గుర్తించింది. వారం రోజుల క్రితం కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలో 6, 7, 8 ప్యాకేజీలు పర్యవేక్షించిన ఈఈ నూనె శ్రీధర్ నివాసాల్లో దాడులు నిర్వహించింది. సుమారు రూ.150 కోట్ల విలువైన లెక్క తేలనని ఆస్తులను గుర్తించింది. ఇప్పటికే ఘోష్ కమిషన్ ఎదుట అనేక మంది ఇంజినీర్లు విచారణకు హాజరయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఏసీబీ దాడులు ఎదుర్కొనే నెక్స్ట్ ఇంజినీర్ అనే ప్రశ్న.. వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా చేస్తున్నది.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి



# యూరియా ధరకు రెక్కలు

## ఉమ్మడి వరంగల్ జిల్లాకు తగ్గిన కేటాయింపులు

- అవకాశంగా మలుచుకుంటున్న కొందరు డీలర్లు
- మార్కెట్ లో కొరత... బ్లాక్ లో అమ్మకం
- ఒక్కో యాభై కిలోల బస్తా ఎమ్మార్పీ రూ.266
- ప్రస్తుతం రూ.280 నుంచి రూ.350 చొప్పున విక్రయాలు
- లేదా డిమాండ్ లేని వాటితో లింక్
- నియంత్రించాల్సిన వ్యవసాయ శాఖ ప్రేక్షక పాత్ర
- వరి నాట్లు మొదలైతే తలెత్తనున్న పరిస్థితిపై రైతుల్లో కలవరం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా కేటాయింపులు జరగటం లేదు. యూరియా కేటాయింపులు గణనీయంగా తగ్గటాన్ని కొందరు డీలర్లు అవకాశంగా మలుచుకుంటున్నారు. దీంతో మార్కెట్ లో యూరియా కొరత తలెత్తుతుంది. అంతేకాదు యూరియా ధరలకు రెక్కలు వస్తున్నాయి. ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేటుతో యూరియా విక్రయాలు జరుగుతున్నాయి. రైతులు దోపిడీకి గురవుతున్నారు. ఒక్కో 50 కిలోల యూరియా బస్తాను ఎమ్మార్పీ రూ.266 చొప్పున అమ్మాల్సి ఉండగా ప్రస్తుతం ఈ ధర బ్లాక్ లో రూ.280 నుంచి రూ.350 వరకు పలుకుతుంది. నియంత్రించాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు తమదేమి పోతుందిలే అనే రీతిలో ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే ఈ పరిస్థితి నెలకొనగా వరి నాట్లు మొదలైతే యూరియా మార్కెట్ ఎలా ఉండబోతుందనేది రైతులను కలవర పెడుతోంది.

- అక్షరదర్బార్, వరంగల్

03

ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఏ1 నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి (ఎస్ఐబీ) చీఫ్ ప్రభాకర్‌రావు మంగళ వారం నాలుగో సారి ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణకు విచారణకు హాజరయ్యారు. ఈసారి సిట్ 600 మంది ఫోన్‌ట్యాపింగ్ ఆడియో క్లిప్పింగ్స్ వినిపించి, మరీ ప్రభాకర్‌రావును ప్రశ్నించనున్నట్లు సమాచారం. ఆడియో క్లిప్పింగ్స్ ఆధారంలో లోతైన విచారణ చేయనున్నట్లు తెలుస్తున్నది. వీరిలో ప్రభుత్వ పెద్దలు, న్యాయమూర్తుల క్లిప్పింగ్స్ కూడా ఉంటాయని సమాచారం. ఎవరి ఆదేశాల మేరకు, ఎవరి నేతృత్వంలో ఫోన్‌ట్యాపింగ్ జరిగిందనే విషయంపై సిట్ స్పష్టమైన వాంగ్మూలం తీసుకుంటుందని.. దాన్ని బట్టి ప్రభాకర్‌రావును మరికొన్నిసార్లు విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

- అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి



02

# నాలుగోసారి విచారణకు ప్రభాకర్‌రావు

# త్వరగా పూర్తి చేసుకోవాలి



- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- పెంబర్తిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలన

02



# సీపీని కలిసిన కలెక్టర్

03

# త్వరగా పూర్తి చేసుకోవాలి

**- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

*** పెంబర్తిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలన**

అక్షరదర్బార్, హసన్ పర్తి: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం పెంబర్తి గ్రామంలో పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారుల స్లాబ్ నిర్మాణాలు, రూఫ్ లెవెల్, బేస్మెంట్ లెవెల్ వరకు చేరుకున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించి లబ్ధిదారులను పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణ పనులను ఏ విధంగా చేయిస్తున్నారని, మేస్త్రీలు ఇంటి నిర్మాణానికి ఎంత తీసుకుంటున్నారు, నిర్మాణ పనులను ఎప్పటి వరకు పూర్తి చేస్తారని, ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ఫోటో క్యాప్చర్ చేస్తున్నారా అని లబ్ధిదారులు స్వరూప, రజిత, నిర్మల, అరుణ, సమ్మక్క, మంజుల, సులోచన, రాజేశ్వరిలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు దశలవారీగా బిల్లులు అందుతాయని, కాబట్టి లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఆమె వెంట జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ రవీందర్, డీఈ సిద్ధార్థ నాయక్, డిప్యూటీ తహసిల్దార్ రహీం పాషా, ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, ఇతర అధికారులతో పాటు ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ప్రతినిధులు, స్థానికులు ఉన్నారు.







# నెక్స్ట్ ఎవరు?

## ఇంజినీర్ల గుండెల్లో రైళ్లు.. ఒకటే దడ

- తేనెతుట్టెలా కాళేశ్వరం ప్రాజెక్ట్ అక్రమార్కులు
- ఇరిగేషన్ అధికారులు, ఇంజినీర్లపై అవినీతి మరకలు
- మాజీ ఈఎన్సీ హరిరాం, ఈఈ శ్రీధర్ నివాసాల్లో ఏసీబీ దాడులు
- వందలాది కోట్ల స్థిరాస్తుల గుర్తింపు.. వాటిలో కొన్ని జప్తు
- పలువురు ఇంజినీర్లు, ఇరిగేషన్ అధికారులపై ఘోష్ కమీషన్ సిఫార్సు

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి:**

ఆదాయానికి మించి అక్రమాస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దూకుడు పెంచింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలో పనిచేసి ఇరిగేషన్శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్ల అక్రమాస్తులపై నిఘా వేసింది. ఇప్పటికే ఏప్రిల్లో 26న ఇరిగేషన్, సీఏడీ మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) హరిరామ్కు చెందిన నివాసాల్లో దాడులు నిర్వహించింది. లెక్కాపత్రాలు లేని వందలాది కోట్ల స్థిరాస్తులను గుర్తించి జప్తు చేసింది. మొత్తం 13 చోట్ల ఏసీబీ దాడులు చేసినట్లు సమాచారం.

**- ఈఈ నూనె శ్రీధర్ అక్రమ ఆస్తులపై..**

ఈఎన్సీపై దాడులు మరచిపోకముందే గత వారంలో ప్రాజెక్ట్ పరిధిలో 6, 7, 8 ప్యాకేజీలను పర్యవేక్షించిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) నూనె శ్రీధర్కు సంబంధించిన నివాసాలు, బంధువులు, సన్నిహితుల ఇండ్లలో మొత్తం 12 చోట్ల ఏకకాలంలో దాడులు చేసింది. దాడులు చేసిన ఇండ్లు, ప్లాట్లు, ఖరీదైన విల్లాలు హైదరాబాద్, బెంగళూరులో ఉన్నాయి. అలాగే 16 ఎకరాల భూమిని కూడా ఏసీబీ గుర్తించింది. వీటన్నింటి విలువ సుమారు రూ.150 కోట్ల వరకు ఉంటాయని ఏసీబీ అంచనా వేసింది. ఈఈ కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ పెద్ద పెద్ద మోటర్లు ఏర్పాటు, సర్జ్పూల్ నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో భారీగా ఆస్తులు వెనుకేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏసీబీ ఇప్పుడు ఈఈకి సంబంధించిన బ్యాంక్ లాకర్లను తెరిచేందుకు సిద్ధమైనట్లు తెలుస్తున్నది. అందుకు సంబంధించిన అనుమతులు తీసుకునేందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. లాకర్లలో భారీగా నగదు, ఆస్తి పత్రాలు, బంగారు ఆభరణాలు బయటపడే అవకాశం ఉందని, అవన్నీ లంచంగా స్వీకరించినవే అయి ఉంటాయని ఏసీబీ భావిస్తున్నది. శ్రీధర్ స్వగ్రామం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామం. ఏసీబీ దాడుల్లో నిందితులుగా నిలిచిన ఈఎన్సీ, ఈఈ.. ఇద్దరూ కూడా కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలో పనిచేసిన ఇంజినీర్లే కావడం గమనార్హం.

### ఇంజినీర్లలో కలవరం..

మేడిగడ్డ బరాజ్ కుంగుబాటు తర్వాత విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం విచారణ చేపట్టింది. తర్వాత ప్రభుత్వం నియమించిన పీసీ ఘోష్ కమిషన్ రంగంలోకి దిగింది. వంద మందిపైగా బాధ్యులను విచారించింది. ప్రాజెక్ట్ నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 17 మంది ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు కూడా చేసింది. పనులు చేపట్టిన ఎల్అండ్టీ సంస్థపైనా చర్యలు తీసుకోవాలని సూచించింది. అలాగే 33 మంది ఇంజినీర్ల పేర్లను సైతం ప్రస్తావిస్తూ, వారికి జరిమానా విధించాలని పేర్కొన్నది. ఘోష్ కమిషన్ విచారణ, వరుసగా ఏసీబీ దాడుల కారణంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగస్వాములైన ఇంజినీర్లలో కలవరం మొదలైంది.

# నాలుగోసారి విచారణకు ప్రభాకర్ రావు

అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1 నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి (ఎస్ఐబీ) చీఫ్ ప్రభాకర్రావు మంగళవారం నాలుగోసారి ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణకు విచారణకు హాజరయ్యారు. ఈసారి సిట్ 600 మంది ఫోన్ట్యాపింగ్ ఆడియో క్లిప్పింగ్స్ వినిపించి, మరీ ప్రభాకర్రావును ప్రశ్నించనున్నట్లు సమాచారం.



ఆడియో క్లిప్పింగ్స్ ఆధారంలో లోతైన విచారణ చేయనున్నట్లు తెలుస్తున్నది. వీరిలో ప్రభుత్వ పెద్దలు, న్యాయమూర్తుల క్లిప్పింగ్స్ కూడా ఉంటాయని సమాచారం. ఎవరి ఆదేశాల మేరకు, ఎవరి నేతృత్వంలో ఫోన్ట్యాపింగ్ జరిగిందనే విషయంపై సిట్ స్పష్టమైన వాంగ్మూలం తీసుకుంటుందని.. దాన్ని బట్టి ప్రభాకర్రావును మరికొన్నిసార్లు విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

**- సాక్షిగా పీసీసీ చీఫ్ వాంగ్మూలం..**

ఫోన్ ట్యాపింగ్ కేసులో పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్ మంగళవారం సాక్షిగా విచారణకు హాజరయ్యారు. 2023లో తాను పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్గా ఉన్నానని, నాడు తన ఫోన్ కూడా ట్యాప్ అయిందని ఆయన గతంలోనే ఆరోపించిన సంగతి తెలిసిందే. ఆయన ఫిర్యాదుమేరకు నాడు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగానే పోలీసులు ఆయన్ను విచారిస్తున్నారు.

# అంగన్ వాడీలో అసెస్మెంట్ కార్డుల ప్రదర్శన

అక్షర దర్బార్, పరకాల : నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం అంగన్వాడి సెంటర్ ను ఒకటిలో ఐసిడిఎస్ సూపర్వైజర్ హేమలత ఆధ్వర్యంలో ప్రీ స్కూల్ సంబంధించిన పిల్లల అసెస్మెంట్ కార్డులను ప్రదర్శించి వాటిపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పి సరిత ,కోడెపాక సుప్రియ, పి రజిని కుమార్, ఎం లక్ష్మి ,ఆయాలు రాధ, వనజ, ముత్యాలు రమ, పిల్లల తల్లులు, గర్భిణీ, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేస్తాం

- ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి
- అసరవెల్లిలో బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిక

అక్షర దర్బార్, నల్లబెల్లి : రాబోయే స్థానిక ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేస్తామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాపరెడ్డి అన్నారు. మంగళవారం నల్లబెల్లి బీజేపీ మండల అధ్యక్షులు తడక వినయ్ గౌడ్ అధ్యక్షతన మండల ఉపాధ్యక్షులు సింగిరెడ్డి యాదగిరి ఆధ్వర్యంలో ఆసరవెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ వార్డు మెంబర్లు కోరిక బద్రు, మహమ్మద్ అలీ, నాయకులు నునావత్ సిక్య నాయక్, పొన్నాల



లింగారెడ్డి, ఈర్ల రాజు, పొన్నాల కిషన్, మునిసాల శివ, గుగులోతు నరసింహ, గుగులోతు బాలు, మాలోతు మోతిలాల్, పరికి సాగర్ బీజేపీలో చేరగా వారికి రాణా ప్రతాప్ రెడ్డి కమలం కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు.

# ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అర్హులకు అన్యాయం

**-ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి జెల్లంపల్లి పవన్**

అక్షర దర్బార్, కేసముద్రం : కేసముద్రం మండలంలో అసలైన నిరుపేదలకు అన్యాయం చేసి ఇండ్లు ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించారని ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి జెల్లంపల్లి పవన్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడారు.



కేసముద్రం మండల వ్యాప్తంగా సొంతింటి కల నెరవేరుతుందని ఆశగా ఎదురు చూసిన నిరుపేదలకు అడియాశలయ్యాయని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యత అధికారులకు ఇవ్వకుండా ఇందిరమ్మ కమిటీలకు ఇవ్వడంతో అసలైన నిరుపేదలకు అన్యాయం జరిగిందని మండిపడ్డారు. ఇందిరమ్మ కమిటీలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే కేటాయించి అసలైన నిరుపేదలకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్యే గారు.. ఆదుకోండి

**ఇల్లు కోల్పోయి రోడ్డున పడ్డాం..**

**ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి**

అక్షర దర్బార్, పరకాల : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి గారూ.. మమ్ములను ఆదుకోండి అని పరకాల పట్టణానికి చెందిన సింగారి సుమతి అభ్యర్థించారు. తన ఇల్లు రోడ్డు వైండింగ్ లో పోగా మిగిలిన కొంత స్థలంలో చిన్నపాటి ఇంట్లో నివసిస్తుండగా అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమై రోడ్డున పడ్డామని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశపడినా తనను ఎవరూ కనికరించలేదని, ఎమ్మెల్యే స్పందించి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.



# సీపీని కలిసిన కలెక్టర్

అక్షరదర్బార్, హనుమకొండ: కొద్ది రోజుల క్రితం హనుమకొండ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన స్నేహ శబరీష్ మంగళ వారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని పోలీస్ కమిషనర్ ఛాంబర్ లో కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కలిసి మొక్కను అందజేశారు.





# యూరియా ధరకు రెక్కలు

- ఉమ్మడి వరంగల్ జిల్లాకు తగ్గిన కేటాయింపులు
- అవకాశంగా మలుచుకుంటున్న కొందరు డీలర్లు
- మార్కెట్ లో కొరత... బ్లాక్ లో అమ్మకం
- ఒక్కో యాభై కిలోల బస్తా ఎమ్మార్పీ రూ.266
- ప్రస్తుతం రూ.280 నుంచి రూ.350 చొప్పున విక్రయాలు
- లేదా డిమాండ్ లేని వాటితో లింక్
- నియంత్రించాల్సిన వ్యవసాయ శాఖ ప్రేక్షక పాత్ర
- వరి నాట్లు మొదలైతే తలెత్తనున్న పరిస్థితిపై రైతుల్లో కలవరం




**అక్షరదర్బార్, వరంగల్ :**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా కేటాయింపులు జరగటం లేదు. యూరియా కేటాయింపులు గణనీయంగా తగ్గటాన్ని కొందరు డీలర్లు అవకాశంగా మలుచు కుంటున్నారు. దీంతో మార్కెట్ లో యూరియా కొరత తలెత్తుతుంది. అంతేకాదు యూరియా ధరలకు రెక్కలు వస్తున్నాయి. ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేటుతో యూరియా విక్రయాలు జరుగు తున్నాయి. రైతులు దోపిడీకి గురవుతున్నారు. ఒక్కో 50 కిలోల యూరియా బస్తాను ఎమ్మార్పీ రూ.266 చొప్పున అమ్మాల్సి ఉండగా ప్రస్తుతం ఈ ధర బ్లాక్ లో రూ.280 నుంచి రూ.350 వరకు పలుకుతుంది. నియంత్రించాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు తమదేమి పోతుందిలే అనే రీతిలో ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే ఈ పరిస్థితి నెలకొనగా వరి నాట్లు మొదలైతే యూరియా మార్కెట్ ఎలా ఉండబో తుంది అనేది రైతులను కలవర పెడుతోంది.

**- ఏం జరుగుతుందంటే..**

ఈ ఏడాది వర్షాలు కొంత ముందుగానే కురవడం మొదలైంది. దీంతో రైతులు ఖరీఫ్ సీజన్ పనులను కూడా ముందుగానే ప్రారంభించారు. మొక్కజొన్న, పత్తి తదితర పంటల విత్తనాలను కొంతవరకు నాటారు. వర్షాలు పడితే రైతులు విత్తనాలు నాటే పనిలో మరింత బిజీ కానున్నారు. ఈ క్రమంలో రైతులు యూరియా కోసం ఎరువుల డీలర్లను ఆశ్రయిస్తున్నారు. అయితే కొరత ఉండటంతో యూరియా క్షేత్రస్థాయిలో ఎమ్మార్పీకి దొరకడం లేదు. స్థానిక డీలర్లు ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేటు చెల్లిస్తామంటే మాత్రం అందుబాటులో ఉందని చెబుతున్నారు. వీరిలో కొందరు ఒక్కో 50 కిలోల యూరియా బస్తాను రూ.280, రూ 300, రూ.320 చొప్పున అమ్ముతున్నారు. గ్రామాల్లో కొందరు ఏకంగా రూ.350 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిసింది. అయితే ప్రత్యామ్నాయం లేక రైతులు అవసరం మేరకు బ్లాక్ లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధర చెల్లించి యూరియాను కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో బస్తాకు అదనంగా రూ.20 నుంచి రూ.80 వరకు చెల్లించాల్సి వస్తుందని కుమిలిపోతున్నారు.

## కారణాలు ఏమిటి?


ఖరీఫ్ సీజన్ మొదలైనప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా కేటాయింపులు జరగలేదని తెలిసింది. గత ఏప్రిల్ ఒకటి నుంచి చాలా తక్కువ యూరియా ఉమ్మడి జిల్లాకు వచ్చినట్లు సమాచారం. రావాల్సినంత యూరియా రాకపోవడంతో మార్కెట్ లో కొరతకు దారి తీసినట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే వచ్చిన యూరియా నిలువల నుంచి 60 శాతం మార్క్ ఫెడ్, 40 శాతం ఎరువుల డీలర్లకు కేటాయించడం జరుగుతుంది. అయితే డీలర్లకు ఇస్తున్న 40 శాతం యూరియాలో నుంచి రిటైల్ డీలర్ల కంటే ఎక్కువ శాతం హోల్ సేల్ డీలర్లకు అందుతున్నట్లు తెలిసింది. అయితే హోల్ సేల్ డీలర్లు లాభార్జనతో తమ వద్ద ఎక్కువ ధరకు కొనుగోలు చేసే క్షేత్రస్థాయి డీలర్లకు యూరియాను అమ్ముతున్నట్లు సమాచారం. ఫలితంగా యూరియా బ్లాక్ లో అమ్మకం జరుగుతున్నట్లు తెలిసింది. అంతేకాదు డీలర్లు డిమాండ్ లేని వాటితో లింక్ పెట్టి యూరియా విక్రయిస్తున్నట్లూ తెలిసింది.

# భూభారతితో భూ సమస్యలు మాయం

**ఆర్డీఓ కే.నారాయణ**

అక్షర దర్బార్, పరకాల : భూభారతితో భూసమస్యలు పరిష్కారమవుతా యని పరకాల ఆర్డీవో కె.నారాయణ అన్నారు. మంగళవారం పరకాల వ్యవసాయ మార్కెట్ లోని రైతు వేదికలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో నారాయణ మాట్లాడుతూ రైతులు తమ సమస్య లను రెవెన్యూ అధికారులకు ఇవ్వాలని భూభారతిలో రైతు సమస్యలు అన్ని తొలగిపోతా యని పేర్కొన్నారు. 501 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి. విజయ లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పి దామోదర్,అడిష నల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




# సైన్స్ మనిషి కంచ కట్టయ్య

- ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయం
- బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రొఫెసర్ కంచ ఐలయ్యను పరామర్శించిన మంత్రి

అక్షరదర్బార్, చెన్నారావుపేట : సైన్స్ మనిషి కంచ కట్టయ్య అని, ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన ప్రొఫెసర్ కంచ ఐలయ్య సోదరుడు కంచ కట్టయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించగా, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రొఫెసర్ కంచ ఐలయ్యతో పాటు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. కంచ కట్టయ్య జీవితం ఎంతో గొప్పదని, గుండెకు సర్జరీ అయిన తర్వాత 46 సంవత్సరాలు స్టీల్ వాల్వ్ తో జీవించా రంటే సైన్స్ చరిత్రలోనే గొప్ప విప్లవమన్నారు. ప్రజలందరూ మూఢనమ్మ కాలను వీడనాడి కంచ కట్టయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ ఓబీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వీరన్న యాదవ్, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సభ్యులు సుభాష్, కంపాటి వీరయ్య,ఓయూ జేఏసి నాయకులు కొంగళ పాండు కురువ, కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నడి రమేష్, వెంకట్ నాయక్, మేకల శివ పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

**మంత్రి పొన్నం ప్రభాకర్**

అక్షర దర్బార్ , నర్సంపేట : సంక్షేమ పథకాలన్నీ అర్హులకు అందేలా చూడాలని బీసీ సంక్షేమ శాఖ , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం చెన్నారావుపేటలో ఓ ప్రవేటు కార్యక్రమానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ అనంతరం నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డితో నర్సంపేట నియోజకవర్గం అభివృద్ధి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక, రైతు భరోసాపై చర్చించారు. నెక్కొండ బస్టాండ్ అభివృద్ధికి నిధుల కేటాయింపునకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, పీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డితో మంత్రి చర్చించారు.

# డేంజర్ జోన్లో ఉన్న ఇండ్లకు పరిహారం, ప్యాకేజి ఇవ్వాలి

**డిప్యూటీ సీఎంకు భూ నిర్వాసితుల వినతి**



అక్షర దర్బార్, మల్హర్ : తాడిచర్ల ఓసీపీ బ్లాక్-1కు డేంజర్ జోన్లో ఉన్న ఇండ్లకు పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజి ఇప్పించాలని భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు దండు రమేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర డిప్యూటీ, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడారు. కాకతీయ థర్మల్ పవర్ ప్లాంటు చెల్పూర్ బొగ్గు నిల్వల వెలికితీతలో భాగంగా 2008న అప్పటి ఏపీ జెన్కో ఆధ్వర్యంలో తాడిచెర్ల గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం జరిగిందన్నారు. ఆ సమయంలో ఉపరితల బొగ్గు గనుల విస్తరణ నిమిత్తమై తాడిచెర్ల, కాపురం శివారులోని 2,300 ఎకరాల విస్తీర్ణం గల వ్యవసాయ భూములు అవసరమని, భూమికి మంచి రేటు ఇస్తామని, మిగులు భూములు కూడా తీసుకుంటామని, ప్రాజెక్టు బౌండరీ నుండి 500 మీటర్ల వరకు ప్రకటించిన డేంజర్ జోన్లోని నివాస గృహాలను సేకరించి పునరావాసం కల్పిస్తామని జెన్కో కంపెనీ మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో గెజిట్ నెం.39/2022 ద్వారా తేది 13-12-2022 రోజున మూడు జాతీయ దినపత్రికలలో ప్రైమరీ నోటిఫికేషన్ జారీ చేసి నివాస గృహాలకు ప్రాజెక్ట్ నెంబర్లు కెటాయించి ఇంటి స్థలాల సర్వే నిర్వహించడం జరిగిందన్నారు.కానీ ఇప్పటి వరకు అట్టి నోటిఫికేషన్పై ఎలాంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఓసిపి బ్లాస్టింగ్ దెబ్బలతో ఉపరితల బొగ్గు గని వలన దుమ్ము, ధూళి, భూమి పొరల్లో నుండి విష వాయువుల వలన మాకు అనేక రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అలాగే బొగ్గు నిల్వలు వెలికి తీస్తున్న క్రమంలో మోతాదుకు మించి బ్లాస్టింగ్లు చేయడం వలన గనికి సమీపంలో గల మా నివాస గృహాలు కూలిపోతూ మేము ప్రమాదాలకు గురి అవుతున్నామని చెప్పారు. పెద్ద మనసుతో ప్రత్యేక చొరవ చూపి డేంజర్ జోన్లో ఉన్న నివాస గృహాలను సేకరించి సురక్షిత ప్రాంతంలో ఇంటి స్థలాలు కేటాయించాలని వారు కోరారు.





# మేస్త్రీలు సహకరించాలి

- **ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, కలెక్టర్ సత్యశారద**
- **నర్సంపేటలో అవగాహన సదస్సు**

నర్సంపేట: అక్షర దర్బార్ : నర్సంపేట నియోజకవర్గ కేంద్రంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు , కమిటీ సభ్యులకు, మేస్త్రిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, కలెక్టర్ సత్యశారద హాజరై పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో నేటికి 3176 ఇండ్లకు మంజూరు పత్రాలు ఇచ్చామని తెలిపారు. మరో 3వేల ఇండ్లు త్వరలో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇండ్ల నిర్మాణానికి మొరం (మట్టి) సమస్య లేకుండా లబ్ధిదారులు తహసీల్దార్లకు దరఖాస్తు పెట్టి అనుమతి తీసుకొని మొరం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మేస్త్రిలకు అధిక మొత్తంలో ఉపాధి దొరుకుతుందని, వారు కూడా లబ్ధిదారులకు ఇబ్బందులకు గురి చేయకుండా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

# బీఆర్ఎస్ హయాంలోనే టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు

- **గతంలో కాంగ్రెస్ ఓటమికి ఫోన్ ట్యాపింగే కారణం**
- **రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధుల వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యతకు భంగం**
- **విచారణ తర్వాత దోషులందరికీ శిక్ష పడాల్సిందే..**
- **టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**
- **జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో సాక్షిగా వాంగ్మూలం**



అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: గతంలో కాంగ్రెస్ పార్టీ ఓటమికి తమ పార్టీ నేతల ఫోన్లను బీఆర్ఎస్ పెద్దలు ట్యాపింగ్ చేయడమే కారణమని, వ్యక్తిగత గోప్యత, స్వేచ్ఛ కు బీఆర్ఎస్ ప్రభుత్వం భంగం కలిగిస్తూ.. టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు పొడిచిందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్ గౌడ్ ఆరోపించారు. హైదరాబాద్లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్కు మంగళవారం ఆయన ఫోన్ట్యాపింగ్ కేసులో సాక్షిగా విచారణకు హాజరయ్యారు. పోలీసులకు తన వాంగ్మూలం ఇచ్చి, బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల ఫోన్లు ట్యాప్ చేయడం హేయమైన చర్య అని, ఆ పని చేసినందుకు గత సీఎం కేసీఆర్, కేటీఆర్ సిగ్గుతో తలవంచుకోవాలని అన్నారు. 2022 నుంచి నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్రెడ్డితో పాటు తన ఫోన్ను కూడా ట్యాప్ చేశారని, తమ కదలికలను ఎప్పటికప్పుడు నిఘా పెట్టారని ఆరోపించారు. ఫోన్ట్యాపింగ్పై తాము గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేశామని, పోలీస్ విచారణలో త్వరలో అన్ని వాస్తవాలు బయటకు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నిక్కచ్చిగా పనిచేయాల్సిన పోలీస్, ప్రభుత్వ అధికారులు నాటి ప్రభుత్వ పెద్దలకు అనుగుణంగా నడచుకున్నారని ఆరోపించారు. పోలీస్ ఉద్యోగానికి పదవీ విరమణ చేసిన ప్రభాకర్రావును గత ప్రభుత్వం ఇంటెలిజెన్స్ చీఫ్గా నియమించిందని, ఆయన కన్నుసన్నల్లోనే కిందిస్థాయి పోలీస్ అధికారులు ఫోన్ట్యాపింగ్కు పాల్పడ్డారని ఆరోపించారు. భవిష్యత్తులో మరెవరూ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా కఠినంగా శిక్షించాలని కోరారు.

# మెరుగైన సేవలు అందించాలి

- **నగర మేయర్ సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**
- **అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం**

అక్షరదర్బార్, వరంగల్: బల్దియా ద్వారా నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్లో అన్ని విభాగాల అధికారులతో సమావేశమై పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, ఎలక్ట్రికల్, హార్టికల్చర్, డీఆర్ ఎఫ్ కార్యకలాపాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణ, వాహనాల స్థితిగతులపై వారు సమీక్షించగా, బల్దియా పరిధిలో 66 డివిజన్ లు ఉన్నాయని, ప్రతి డివిజన్ కు ఇద్దరు జవాన్లు, 28 నుంచి 35 వరకు పారిశుద్ధ్య కార్మికులు, 501 పారిశుద్ధ్య వాహనాలు, అందులో క్రాంప్టర్లు, డోజర్స్, హిటాచి మిషన్స్, టిప్పర్స్, స్వీపర్ మిషన్స్, స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లు తదితర వాహనాలు ఉన్నాయని, మూడు వైకుంఠ రథాలు సేవలు అందిస్తున్నట్లు, 440 టన్నుల చెత్త ప్రతిరోజు సేకరణ జరుగుతుందని, 22 డీఆర్సీ కేంద్రాలు, హసన్పర్తిలో ఏబీసీ సెంటర్ నిర్వాహణ, రాంపూర్ డంప్ యార్డ్ నిర్వహణపై సీఎ హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి తెలుపగా పారిశుద్ధ్య నిర్వహణ



పటిష్టంగా జరగాలని, ప్రతి గృహం నుంచి ప్రతిరోజు స్వచ్ఛ ఆటోల ద్వారా తడి పొడి చెత్త సేకరణ జరిపి సెకండరీ ట్రాన్స్ఫర్ స్టేషన్ లకు తరలించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు జరగాలన్నారు.

ఇంజనీరింగ్ అధికారులతో ప్రతిరోజు మంచినీటి సరఫరా, ఫిల్టర్ బెడ్ల నిర్వహణ, లీకేజీల అరికట్టుట, వర్షాకాలంలో వరద నివారణకు చర్యలపై అధికారులతో సమీక్షించగా, మహానగరంలోని సుమారు 10 లక్షల మందికి 85% ప్రతిరోజు, 15 శాతం దినం తప్పి దినం మంచినీరు సరఫరా జరుగుతున్నదని, ధర్మసాగర్ లోని ప్రధాన నీటి సోర్స్ ద్వారా ధర్మసాగర్, కాకతీయ యూనివర్సిటీ, దేశాయిపేట్, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ల ద్వారా రా వాటర్ ను శుద్ధి చేసి స్వచ్ఛ తాగునీటిని , 125 ఈ ఎస్ ఎల్ ఆర్ ల ద్వారా అందిస్తున్నట్లు, 230 ఎంఎల్డీ నీటి సామర్థ్యం ఉండగా ప్రతిరోజు 205 ఎమ్మెల్డీ నీటిని వినియోగిస్తున్నట్లు ఇంచార్జ్ ఎస్ ఈ శ్రీనివాస్ తెలుపగా, ప్రణాళిక బద్ధంగా ఎప్పటికప్పుడు లీకేజీలను అరికడుతూ, నిత్యం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ చివరి ఇంటి వరకు నీరందేలా చూడాలని, ఏదైనా కారణాల చేత నీరందరిని ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. అనంతరం సఫాయి మిత్రా కార్మికుల ఆరోగ్య రక్షణలో భాగంగా నమస్తే కార్యక్రమం క్రింద 37 మంది సఫాయి మిత్ర కార్మికులకు, సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లకు పిపిఈ పిట్లను కిట్లను మేయర్, కమిషనర్లు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోన, ఇంచార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఇంచార్జ్ ఎస్ ఈ శ్రీనివాస్, సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ శివలింగం, హార్టికల్చర్ ఆఫీసర్లు రమేష్, లక్ష్మారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, డీఎఫ్ శంకర్ లింగం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మహేందర్, రవికుమార్, సంతోష్ బాబు, మాధవిలత, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**- జిల్లా కలెక్టర్ సత్య శారద**



అక్షరదర్బార్, వరంగల్: జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఇన్నర్ రింగ్ రోడ్, నేషనల్ హైవే గ్రీన్ ఫీల్డ్, కాకతీయ మెగా టెక్స్ టైల్ ఇండస్ట్రియల్ పార్క్, ఆర్ ఓబి అభివృద్ధి పనులపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మాణాన్ని ప్రాధాన్యతతో కొనసాగించాలని సూచించారు. నేషనల్ హైవే గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టులో భూ సేకరణలో భాగంగా భూ నిర్వాసితులకు పెండింగ్ లో ఉన్న నష్ట పరిహారం చెల్లించుటకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ అభివృద్ధిలో భాగంగా గ్రీన్ కవరింగ్ ఏర్పాటుకు హార్టికల్చర్, ఫారెస్ట్, అనుసంధాన కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.





# కాళేశ్వరం పేరిట గత ప్రభుత్వం దోపిడీ

- కాంగ్రెస్ ప్రభుత్వాలు కట్టిన ప్రాజెక్టులకు చిన్న పగులు కూడా రాలేదు
- ఉచిత విద్యుత్ పథకాలకు ఏటా రూ.13,992 కోట్ల ఖర్చు
- రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క
- మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ, ఎమ్మెల్యేతో కలిసి సబ్ స్టేషన్ల శంకుస్థాపన, ప్రారంభం
- భూపాలపల్లిలో భారీ ర్యాలీ, బహిరంగ సభ

అక్షరదర్బార్, భూపాలపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర సొమ్ము దోపిడీ చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అత్యంత ప్రమాదకరమని, డిజైన్ కు, కట్టిన దానికి పొంతనలేదని ఎన్డీఎస్ ఏ చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, వరంగల్ ఎంపీ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి భూపాలపల్లి నియోజకవర్గంలో పర్యటించారు. కొత్తపల్లిగోరి మండలం చెన్నాపూర్ గ్రామం వద్ద నిర్మాణం పూర్తి చేసుకున్న విద్యుత్ సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. అనంతరం మోరంచపల్లి నుంచి భూపాలపల్లి వరకు జరిగిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. తర్వాత భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్ నగర్ వద్ద మంజూర్ నగర్, ధర్మరావు పేట, నవాబుపేట సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇక్కడ స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కట్టిన ప్రాజెక్టులకు చిన్న పగులు కూడా రాలేదని అన్నారు. రాష్ట్రంలో ఇల్లు లేని, ఆదాయం లేని కుటుంబాలు ఉండొద్దని, ఆకలితో ఏ ఒక్కరు బాధపడొద్దు అనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమాన్ని వెనుకబడనియ్యమని, అభివృద్ధిని ఆగనీయమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం రెండువేల మెగావాట్ల విద్యుత్తు అదనపు డిమాండ్ వచ్చినా రాష్ట్రంలో ఒక్క నిమిషం అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసిన చరిత్ర రాష్ట్ర ప్రభుత్వానిదని తెలిపారు. ఉచిత విద్యుత్తు పథకాల కోసం రాష్ట్ర ప్రజల పక్షాన ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.13,992 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. కాళేశ్వరం పేరిట రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టి రాష్ట్ర ప్రభుత్వ సొమ్ము దోపిడీ చేసిన బీఆర్ఎస్ నాయకులు సిగ్గు లేకుండా కాళేశ్వరం బ్రహ్మాండమని చెబుతుంటే జనం నవ్వుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదు అని ఎన్నికల ముందు బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేశారని గుర్తు చేశారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ పథకానికి ఇప్పటివరకు 16 వేల కోట్లు ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లించిందని చెప్పారు. రాష్ట్రంలో 50 వేల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, వరంగల్ ఎంపీ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తదితరులు ఈ సభలో మాట్లాడారు. సభ అనంతరం మంత్రులు సింగరేణి ఓపెన్ కాస్ట్- 2 ఉపరితల బొగ్గు గని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎండి బలరాంనాయక్, డైరెక్టర్ ఫా గౌతం పొట్రో, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు.

# పారదర్శకంగా 'ఇందిరమ్మ' ఎంపికలు

- రానున్న నాలుగేళ్లలో ప్రతి ఒక్క అర్హుడికి ఇల్లు
- పేదవాడి కలను సాకారం చేస్తున్నాం
- ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం



అక్షరదర్బార్, వెంకటాపురం నూగూరు: పారదర్శకంగా, పార్టీలకతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం వాజేడు రైతు వైదికలో, వెంకటాపురం మార్కెట్ యార్డులో వేరు వేరుగా వాజేడు, వెంకటాపురం మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని అన్నారు. వాజేడు, వెంకటాపురం మండలంలో ఏ ఒక్కరికీ ఇల్లు రాలేదని అన్నారు. పేదవాడి కల సాకారం చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామంలో ఇండ్లు మంజూరు చేయగా నిర్మాణం జరుగుతోందని తెలిపారు. మొదటి దఫాలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందచేయడం జరుగుతుందని, రానున్న నాలుగేళ్లలో ప్రతి ఒక్క పేదవాడి సొంతింటి కలను నిజం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ జిల్లాలో పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుల చొరవతో ఈ నియోజకవర్గంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సూర్య నారాయణ, మండల ప్రత్యేక అధికారులు, ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా నిధులు జమ

- రైతన్నకి భరోసా కల్పించిన ప్రభుత్వం
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



అక్షరదర్బార్, జనగామ: చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రైతుభరోసా పథకంలో భాగంగా... పంట పెట్టుబడి సాయం అందిస్తున్నదని.. ఇందులో భాగంగా వానాకాలం 2025కి సంబంధించి పంట పెట్టుబడి సాయం కింద.. జిల్లాలో ఇప్పటివరకు 1,35,602 మంది రైతులకి రూ.106.08 కోట్ల నిధులు నేరుగా వారి బ్యాంకు కాతాలో జమ చేయడం జరిగిందని మంగళవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ జిల్లాలో 1,98,072 మంది రైతులకి గాను రూ.240.22 కోట్ల నిధులు విడుదల చేయాల్సి ఉండగా.. 1,83,907 (232.83కోట్లు) మంది రైతుల బ్యాంకు ఖాతా వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు ఇప్పటికే రైతు భరోసా పోర్టల్ నందు పొందు పరచడం జరిగిందన్నారు. అందులో 1,66,264 మంది రైతులకిగాను రూ.176.83 కోట్లు నగదు బదిలీ కొరకు ట్రెజరి నందు రాష్ట్ర ప్రభుత్వం బిల్స్ రూపంలో సబ్మిట్ చేయడం జరిగిందని, ఇప్పటివరకు 1,35,602 మంది రైతులకి రూ.106.08 కోట్లు రైతు భరోసా నిధులు జమ అయ్యాయని.. మిగతా వారికి కూడా అతి త్వరగా వారి ఖాతాలో జమ అవుతాయన్నారు. కాగా.. ఇచ్చిన మాటకి కట్టుబడి ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందించినందుకు జిల్లా రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278 ★ RNI NO. TELTEL/2022/81915